


సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
సోమవారం 31-3-2025
సంపుటి: 21 సంచిక: 5
పేజీలు: 8 వెల: రూ.1










# డైట్‌నూ డీఈవో సీటునూ వదలరు

జిల్లా విద్యాశాఖాధికారి సీటంటే ఆయనకు విపరీతమైన మోజు. జిల్లాలో ఉపాధ్యాయులపై సవారీ చేయడానికి అంతకు మించిన అవకాశం ఉండదనేది ఆయన భావన. అవకాశం దొరికిన ప్రతీసారి డీఈవో సీటులో కూర్చోవాలని ఆయన తహతహలాడుతుంటారు. అందుకే వైకాపా అధికారంలో ఉంటే డీఈవోగా పని చేస్తున్న వ్యక్తిపై టీడీపీ ముద్ర వేసి బయటకు పంపిస్తారు. టీడీపీ అధికారంలోకి వస్తే తనకు మించిన స్వామిభక్తుడు ఎవరూ ఉండరని నిరూపించుకుంటారు. అందుకే రెగ్యులర్ డీఈవో పోస్టు ఖాళీ అయిన ప్రతీసారి అందులో తిష్ట వేయడానికి తిరుమలచైతన్య పడరాని పాట్లు పడుతుంటారు. గత ఏడాది టెన్త్ స్పాట్ వాల్యూయేషన్ సమయానికి అప్పటి డీఈవో పగడాలమ్మ స్పాట్ వాల్యూయేషన్ క్యాంప్ ఆఫీసర్‌గా ఉన్నారు. డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్‌గా తిరుమల చైతన్య వ్యవహరించారు. అదే సమయంలో అప్పటి విద్యాశాఖ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా పగడాలమ్మ డీఈవో హోదాలో ఆయన్న ఫాలో అయ్యారు. డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్ హోదాలో టెన్త్ స్పాట్ వాల్యూ షన్‌ను దగ్గరుండి పర్యవేక్షించాల్సిన తిరుమల చైతన్య చేతులెత్తేయడంతో ఉపాధ్యాయ వర్గాలు డీఈవో పగడాలమ్మపై తిరుగుబాటు బావుటా ఎగరేశారు. అదే సమయంలో తిరుమల చైతన్య పగడాలమ్మ సీటులో కూర్చున్నారన్న ఆరోపణలు కూడా వినిపించాయి. ఆ తర్వాత ఆమెకు అడ్మినిస్ట్రేషన్ చేతకాదని ప్రచారం చేసి, ఏకంగా ఆమె సీటులోకే వచ్చేశారు. విద్యాశాఖలో క్రీమ్ ఉన్న పోస్టులన్నీ తిరుమల చైతన్య చేశారు.



- అధికార దర్పం.. అహంకారం ఆయన నైజం
- ఆర్‌వీఎం పీవో పోస్టు నుంచి రాత్రికి రాత్రే తప్పించిన నాగులాపల్లి
- పగడాలమ్మకు ప్రతీసారి మోకాలడ్డు
- క్రిమినల్ కేసులున్నవారికి త్వరలో క్లీన్‌చిట్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌గా ఎప్పట్నుంచో వ్యవహరిస్తున్న తిరుమల చైతన్య అందుకు సంబంధించి అక్కడ ఏ వ్యవహారాన్నీ బయటపడకుండా ఇన్నాళ్లూ జాగ్రత్త పడుతూ వస్తున్నారు. అలాగే రాజీవ్ విద్యామిషన్ ఉన్నప్పుడు దానికి ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా కూడా పని చేశారు. నాగులాపల్లి శ్రీకాంత్ కలెక్టర్‌గా ఉన్నప్పుడు ఆర్ అండ్ బి బంగ్లాలో ఏం జరిగిందో తెలీదుగానీ, తిరుమల చైతన్యను ఆర్‌వీఎం పీవో విధుల నుంచి వెంటనే రిలీవ్ చేసేశారు. ఆ తర్వాత అడపా దడపా ఆయన డీఈవో పోస్టు చేస్తునే ఉన్నారు. ఎన్టీఆర్ ఎంహెచ్ స్కూల్‌లో ఓపెన్ స్కూల్ పరీక్షలు జరుగుతుంటే ఓ ఏడాది ఈయన చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. ప్రతీ ఏడాది మెయిన్ పరీక్షలకు సిటింగ్ స్క్వాడ్‌లుగా తన అనుయాయులను నియమించి ఉపాధ్యాయులు, ఇన్విజిలేటర్ మీద సవారీ చేస్తుంటారు. ఓపెన్ స్కూల్ పరీక్షలో కూడా ఫ్లయింగ్ స్క్వాడ్ పేరుతో ఎన్టీఆర్ ఎంహెచ్ స్కూల్‌లో డీఈవో అనుంగ ఉపాధ్యాయుడొకరు ఆ మధ్య హల్‌చల్ చేయడం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఇప్పుడు ఇంత జరిగినా డీఈవోగా తిరుమల చైతన్యను మాత్రం తప్పించే పనికి జిల్లా నాయకులు పూనుకోవడంలేదు. పగడాలమ్మను డీఈవోగా తేవాలని తాను భావించినప్పటికీ తిరుమల చైతన్య వచ్చారని సోమవారం తనను కలిసిన ఉపాధ్యాయ ఐక్యవేదిక ప్రతినిధుల ముందు మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నా, డీఈవోను ఇక్కడి నుంచి తప్పించాలని మాత్రం ఆయన ఖరాఖండిగా విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజుకు చెప్పలేదు. ఉపాధ్యాయ సంఘ నేతల ముందే విజయరామరాజుకు ఫోన్ చేసిన మంత్రి అచ్చెన్నాయుడు జిల్లాలో ఉపాధ్యాయుల ఉద్యమబాట, విద్యార్థుల డిబారు వంటివి ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తుంది కాబట్టి వెంటనే - మిగతా చివరి పేజీలో









• ఎడిటోరియల్

# సంఖ్యాధిక్య బీసీలకు రాజ్యాధికారం కలే!

రాష్ట్రంలో తక్కువ జనాభా ఉన్న అగ్ర కులాలే రాజ్యాధికారం అనుభవిస్తున్నాయి. సింహభాగం ఉన్న వెనుకబడిన వర్గాలకు స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి రాజ్యాధికారం దక్కడం లేదంటూ ఒక నేత తన పార్టీకి నివేదిక ఇచ్చారు. ఆ నివేదికలోని గణాంకాలు పాతవే, వాస్తవాలే అయినా రాష్ట్రంలో బీసీ ఉద్యమం వచ్చే పరిస్థితి లేదు. విడిపోయిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో పెద్దగా పరిస్థితులు మారక పోయినా తెలంగాణలో కులాల కుంపట్లు లేని రాజకీయాలు నడుస్తున్నాయి. వెనుకబడిన కులాల్లో చైతన్యం కనిపిస్తోంది. అది భవిష్యత్‌లో బీసీ ఉద్యమానికి దారితీసే అవకాశాలు ఉన్నాయి. ఆంధ్రలో పరిస్థితి దీనికి భిన్నం. కులాల మధ్య స్పష్టమైన గీత కనిపిస్తుంది. ఆర్థికంగా బలంగా ఉన్న సామాజిక వర్గం రాజకీయాలను శాసిస్తూ వస్తోంది. అధికార వ్యవస్థ వారి మాట వినాల్సిందే.. ఆ కుటుంబాలకు ఉన్న భూయాజమాన్య హక్కులతో పాటు ఆర్థిక ఎదుగుదలే దానికి కారణం. అందుకే ఏ గ్రామంలో చూసినా కమ్మ, రెడ్డి, కాపు, క్షత్రియ, కొన్నిచోట్ల వెలమ వర్గాల డామినేషన్ కనిపిస్తుంది. మిగిలిన కులాల నుంచి కొందరు నేతలున్నా రాజ్యాధికారంలో కమ్మ, రెడ్డిలదే శాసనం. బీసీ వర్గాల నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలుగా ఎన్నికైన వారు తమ వర్గాలను పట్టించుకోవడం లేదన్న విమర్శ ఉంది. అగ్ర కులాలతో అంటకాగుతూ బీసీలకు న్యాయం చేస్తున్నారన్న వాదనలు ఉన్నాయి. తమకు సీటిచ్చిన పార్టీలకు కట్టుబడి ఉండాల్సిన పరిస్థితుల్లో పార్టీల వద్ద బీసీల ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బీసీ జాబితాలో 139 దాకా ఉప కులాలు ఉన్నా వాటి మధ్య ఐకమత్యం లేకపోవడం వల్ల రాజ్యాధికారం అందకుండాపోతోంది. బీసీ ప్రజల్లో రాజ్యాధికార కాంక్ష లేకపోవడం కూడా దీనికి మరో కారణం. రాష్ట్రంలో రెడ్లు 20,84,416 ఉండగా, స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి ఆ కులం నుంచి ఏకంగా 658 మంది ఎమ్మెల్యేలయ్యారు. 14,32,725 జనాభా ఉన్న కమ్మ వర్గం నుంచి 549 మంది, 41,73,211 మంది జనాభా ఉన్న కమ్మ కులం నుంచి 314 మందే ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. అదే సమయంలో తూర్పు కాపు జనాభా 16 లక్షల పైగా ఉంటే వారి నుంచి 80 మంది, 24 లక్షల జనాభా ఉన్న ముస్లిం షేక్‌ల నుంచి 54 మంది, 10 లక్షల వరకూ ఉన్న గౌడల నుంచి 50 మంది, 26 లక్షల జనాభా ఉన్న యాదవుల నుంచి 46 మంది, 8 లక్షలుగా ఉన్న పద్మశాలీల నుంచి 21 మంది, 5 లక్షల జనాభా ఉన్న 18 మంది, 13 లక్షల జనాభా ఉన్న వాల్మీకి బోయ వర్గం నుంచి 17 మంది, 12 లక్షల వరకూ ఉన్న రజక వర్గం నుంచి ఒక్కరు ఎమ్మెల్యే అయ్యారు. 10 లక్షల జనాభా వడ్డెర్లకు అసెంబ్లీలో ఇంతవరకు ప్రాతినిధ్యం లభించలేదు. బీసీల్లో రాజకీయంగా రాణించినవారు లేరా అంటే చాలామందే ఉన్నారు. గౌతు లచ్చన్న, ప్రగడ కోటయ్య లాంటి నేతలు సామాజికంగా, రాజకీయంగా సత్తా చాటారు. అణగారినవర్గాల ఆశాజ్యోతిగా గౌతు లచ్చన్న రాణించిన తీరు.. ఆయనకు సర్దార్ పేరు వచ్చేలా చేసింది. లచ్చన్న అత్యంత వెనకబడిన శ్రీకాకుళం జిల్లా నుంచి ఎదిగి దేశ రాజకీయాలను ప్రభావితం చేసే స్థాయికి చేరుకున్నారు. ఆయన ఎపుడూ అధికార పార్టీల విధానాలనే విమర్శించారు. తన జీవితం మొత్తం బడుగు, బలహీనుల కోసం అంకితం చేసిన నేత. అటువంటి నేతలను కూడా పార్టీల పరంగా వాడేసుకున్నారు.. వాడుకుంటున్నారు కూడా. బీసీ లీడర్లంతా తమకు వచ్చిన అవకాశాలతో తమ సామాజికవర్గాల, బడుగుల శ్రేయస్సు కోసం పనిచేశారే తప్ప బీసీలకు రాజ్యాధికారం అనే కాన్సెప్ట్‌ను ఎప్పుడూ తీసుకురాలేదు. ఆ తర్వాత బీసీ నేతలుగా ఎదిగిన టీడీపీ నేత ఎర్రన్నాయుడు, మరికొందరి రాజకీయ ప్రస్థానం కూడా అదేరీతిలో సాగింది. ప్రస్తుతం పార్టీల వారీగా ప్రజాప్రతినిధులుగా ఉన్న బీసీ వర్గానికి చెందిన నేతలు కూడా పార్టీ గీతకు లోబడే రాజకీయాలు చేయగలుగుతున్నారే గానీ, దాని పరిధి దాటి తమ కులానికో, మొత్తం బీసీ వర్గాలకో రాజకీయ ప్రయోజనం కల్పించే ప్రయత్నాలకు సాహసించలేకపోతున్నారు. ఆ పరిస్థితి ఏపీలోని ఏ పార్టీలోనూ మచ్చుకైనా కనిపించదు. రాష్ట్రంలో ఏ గ్రామాన్ని తీసుకున్నా కొన్ని కులాల అధిపత్యమే కనిపిస్తుంది. జనాభాపరంగా ఆ గ్రామంలో అధిక సంఖ్యలో లేకపోయినా గ్రామంలో ఉన్న ఒకటి రెండు పెత్తందారీ కుటుంబాల వారే రాజకీయ ఆధిపత్యం చెలాయిస్తుంటారు. స్థానిక రాజకీయాలతో పాటు, అధికారులను శాసిస్తారు. పాలకవర్గంతో సత్సంబంధాలు నెరుపుతూ గ్రామంలో అందరినీ చెప్పుచేతల్లో పెట్టుకుంటారు. సంఖ్యాధిక్యత ఉన్న బీసీ వర్గాలు కూడా వారి ఆధిపత్యంలో ఒదిగిపోయి అనుచరులుగా కొనసాగుతూ తమ ప్రత్యేకతను కోల్పోతుంటారు. ఈ ధోరణే బీసీ ఉద్యమానికి చేటు చేస్తుంది.

# డేవిడ్ మాదారపు సేవలు కొనసాగాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

డేవిడ్ మాదారపు సేవలు కొనసాగాలని, నిత్యం ఏదో ఒక సేవలో తన మిత్రబృందంతో చేస్తున్న సేవలను చూస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖమాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఉగాది సందర్భంగా మంత్రిని కలిసిన డేవిడ్‌ను అభినందించి మాట్లాడుతూ తన జన్మదినాన రక్తదాన కార్యక్రమం నిర్వహించి 50 యూనిట్ల రక్తాన్ని న్యూ శ్రీకాకుళం రక్తనిధి కేంద్రానికి అందించటం అభినందనీయమన్నారు. ముఖ్యంగా తలసేమియా పిల్లల కోసం కార్యక్రమాన్ని నిర్వహించటం సంతోషాన్నిచ్చిందన్నారు. మీ సేవలు భవిష్యత్ తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. అలాగే ట్రెజరీ హెల్పింగ్ హాండ్స్ సంస్థ ద్వారా చేస్తున్న సేవలను కూడా విన్నానని, చిన్న వయసులో ఉంటూ, పెద్ద ఆలోచనతో ముందుకు వెళ్ళటం గొప్పవిషయమన్నారు. ఇందులో భాగంగా ఎన్టీఆర్ ఎంఎస్ఎస్ బృందానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం మంత్రికి జ్ఞాపికను అందించి, దుస్సాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాదారపు వెంకటేష్, న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు మేనేజర్ డా.టి.మణికంత, ఎన్టీఆర్ ఎంఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.



# ఒత్తిడి లేకుండా ఆనందంగా జీవించండి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మానసిక ఒత్తిడి లేకుండా జీవనం సాగిస్తే సగం వ్యాధులు దరిచేరవని .. ప్రస్తుత వేసవిలో ప్రతీ ఒక్కరూ ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీకాకుళం నగరానికి చెందిన ప్రముఖ గాస్ట్రోలజీ వైద్య నిపుణులు డాక్టర్ గొండు గంగాధర్ రావు అన్నారు. ఆదివారం శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలు అనే అంశంపై వాకర్స్‌కు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ గంగాధర్ మాట్లాడుతూ స్వీయ రక్షణతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అని అన్నారు. ఈ ఏడాది తీవ్రమైన ఎండలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రతీ ఒక్కరూ విధిగా త్రాగు నీరు ఎక్కువ తీసుకోవాలని.. త్రాగునీటి ద్వారా సగం జబ్బులు మటుమయం అవుతాయన్నారు. ఎండల తీవ్రత వల్ల డీహైడ్రేషన్ కు గురయ్యే ప్రమాదం ఉందని, అందువల్ల ప్రతీ ఒక్కరూ ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవాలని సూచించారు. చక్కని ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని, ఆయిల్ ఫుడ్స్, జింక్ ఫుడ్స్, ఉప్పు చేపలు, పచ్చళ్లకు దూరంగా ఉండాలన్నారు. సమతుల ఆహారాన్ని ఈ కాలంలో అలవాటు చేసుకోవాలన్నారు. ప్రతీరోజూ ఎక్కువ పోషకాలు ఉండే పండ్లను తీసుకోవడం, రాగులు, సామలు, కొర్రలు, జొన్నలు సజ్జలు వంటి చిరుధాన్యాలు తీసుకుంటే ఆరోగ్యానికి రక్షణ ఉంటుందన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం, యోగా, వాకింగ్ జాగింగ్ చేసే వారికి వ్యాధులురావని.. బీపీ షుగర్ ఉన్న వారు తప్పనిసరిగా వ్యాయామం, యోగా, వాకింగ్ చేయాలని సూచించారు.. అనంతరం స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్, పీజీ గుప్తా, శాసపు జోగినాయుడు, గుడ్ల జగ్గారావుల సారధ్యంలో డాక్టర్ గొండు గంగాధర్ దంపతులకు సత్కరించారు.. పలువురు వాకర్స్ అడిగిన సందేహాలకు సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గురు ఆనందరావు, సుగంధం సంజీవరావు, గేదెల లక్ష్మీ, గోలీ ఉమా మహేశ్వరరావు, ఎన్.ఉపేంద్ర, జ్యోతి, మల్లిబాబు, ఎండ మోహన్, బాక్సింగ్ కోచ్ రాజీవ్ బృందం.. జెసి పట్నాయక్.. నందిగామ కామేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన నాట్యం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నగరంలో విశాఖ ఏ కాలనీలో ఉన్న 'విశ్వంభర పరంపర ట్రస్ట్ 'మాతాజీ జన్మదిన వేడుకల సందర్భంగా గొప్ప నృత్య కార్యక్రమంను ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో మెహర్ నృత్యకళానికేతన్‌కు చెందిన గురువుగుండ రామలక్ష్మి శిష్యులు ప్రదర్శించిన నాట్యం అందరిని అలరించింది. లక్ష్మి నాగసాయి భువిక హాస్మిత ఉషశ్రీ తదితర నృత్య విద్యార్థుల ప్రదర్శనను పెద్దలు ఆశీర్వదించారు. అనంతరం మాతాజీ రామలక్ష్మిని సన్మానించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ అమ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు



# పేదల డాక్టర్ సమాజానికి ఎంతో అవసరం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం )

పేదల డాక్టర్ ఇంజరాపు మోహన్‌రావు నేటి సమాజానికి ఎంతో అవసరమని, ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారని బలివాడ మల్లేశ్వర రావు అన్నారు. మణిపాత్రుని క్రియేటివ్ అకాడమీ ఆధ్వర్యంలో ఉగాది పండుగ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన ప్రముఖులకు వివిధ రకాల అవార్డులతో సత్కరించారు.ఇందులో భాగంగా అరసవల్లికి చెందిన ప్రముఖ పీఎంపీ వైద్యులు డాక్టర్ ఇంజరాపు మోహన్‌రావుకు "వైద్యరత్న" అవార్డును విశిష్ట అతిథి బలివాడ మల్లేశ్వర రావు చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా బలివాడ మల్లేశ్వరరావు మాట్లాడారు. సమాజసేవలో ఉన్న మోహనరావుకు తన చేతులమీదుగా అవార్డును ఇవ్వడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. పేదల వైద్యునిగా మంచి గుర్తింపు పొందారని, ఇలాంటి వారు సమాజానికి అవసరం అని, ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మణిపాత్రుని నాగేశ్వరరావు, మణిపాత్రుని భాగ్యలక్ష్మి, డాక్టర్ డబ్బీరు గోవింద రావు తదితరులు పాల్గొన్నారు.





**కథ:** చదువు ముగించుకుని జీవితంలో సెటిలైన 'మ్యాడ్' గ్యాంగ్ మనోజ్ (రామ్ నితిన్).. అశోక్ (నార్నె నితిన్).. దామోదర్ (సంగీత్ శోభన్).. తమ ఫ్రెండ్ అయిన లడ్డు (విష్ణు ఓయ్) పెళ్లి చూడడం కోసం తన ఇంటికొస్తారు. కానీ కాసేపట్లో తాళి కట్టాల్సి ఉండగా 'మ్యాడ్' గ్యాంగుతో పాటుగా వచ్చిన అబ్బాయితో పెళ్లికూతురు వేరే అబ్బాయితో లేచిపోతుంది. దీంతో తన స్నేహితుల మీద కోపం పెంచుకుంటాడు లడ్డు. అతణ్ని కూల్ చేయడానికి ముందు హనీమూన్ ప్లాన్ చేసిన గోవాకే బయల్దేరుతుంది మ్యాడ్ గ్యాంగ్. కానీ అక్కడికి వెళ్లాక పెద్ద సమస్యలో చిక్కుకుంటారు. ఆ సమస్య ఏంటి.. దాన్నుంచి వాళ్లెలా బయటపడ్డారు అన్నది మిగతా కథ.

**నటీనటులు:** 'మ్యాడ్' గ్యాంగ్ మంచి ఎనర్జీతో నటించింది. ముఖ్యంగా సంగీత్ శోభన్ మరోసారి చెలరేగిపోయాడు. ఫస్ట్ పార్ట్ తో పోలిస్తే తనలో మరింత కాన్ఫిడెన్స్ కనిపిస్తుంది. తన కామెడీ టైమింగ్ భలేగా అనిపిస్తుంది. రామ్ నితిన్ సైతం హుషారుగా నటించాడు. నార్నె నితిన్ మాత్రం జస్ట్ ఓకే అనిపిస్తాడు. ఈ ముగ్గురు హీరోల కంటే విష్ణు ఓయ్ కి ఎక్కువ మార్కులు పడతాయి. అతను ప్రతి సీన్లోనూ నవ్వించాడు. పెళ్లి చెడిపోయిన కుర్రాడిగా విష్ణును చూస్తేనే నవ్వొస్తుంది. తన తండ్రి పాత్రలో మురళీధర్ గౌడ్ అదరగొట్టాడు. ఈ తండ్రీ కొడుకుల వినోదమే సినిమాకు మేజర్ హైలైట్. సునీల్ కామెడీ డాన్ పాత్రలో మెప్పించాడు. సత్యం రాజేష్.. అనీష్ కురువిల్లా.. వీళ్లంతా మామూలుగా అనిపిస్తారు.

**సాంకేతిక వర్గం:** 'మ్యాడ్ స్క్వేర్' టెక్నికల్ గా ఓకే అనిపిస్తుంది. భీమ్స్ సిసిరోలియో మంచి బీటున్న పాటలు అందించాడు. కానీ 'మ్యాడ్'లో 'నువ్వు నవ్వుకుంటూ..' తరహా వినసొంపైన పాట లేని లోటు కనిపిస్తుంది. తమన్ బ్యాగ్రౌండ్ స్కోర్ హుషారుగా సాగింది. శ్యామ్ దత్ ఛాయాగ్రహణం బాగుంది. విజువల్స్ కలర్ ఫుల్ గా సాగాయి. నిర్మాణ విలువలు సినిమాకు తగ్గట్లుగా ఉన్నాయి. ఇక రైటర్ కమ్ డైరెక్టర్ కళ్యాణ్ శంకర్.. ఫస్ట్ పార్ట్ స్టయిల్లోనే సినిమాను బిందాస్ స్టయిల్లో నడిపించాలని చూశాడు. కొంత వరకు బాగానే నవ్వించగలిగాడు. 'మ్యాడ్'లో కాలేజీ నేపథ్యంలో ఫ్రెష్ సీన్స్ రాసిన అతను.. 'మ్యాడ్ స్క్వేర్'లో మాత్రం ఎన్నోసార్లు చూసిన కన్ఫ్యూజింగ్ క్రైమ్ కామెడీలను ఫాలో అయిపోయాడు. తన కామెడీ పెన్ను ఒక దశ దాటాక మొరాయించేసిన ఫీలింగ్ కలుగుతుంది

'మ్యాడ్ స్క్వేర్' చాలా ప్రామిసింగ్ గానే మొదలవుతుంది. కాలేజీ జీవితం అయిపోయాక లడ్డు పెళ్లి కోసం 'మ్యాడ్' గ్యాంగ్ మళ్లీ కలవడంతో ఈ కథ మొదలవుతుంది. తన దోస్తులు వచ్చారని సంతోషించడం పోయి వీళ్లేం తలనొప్పి తెచ్చిపెడతారో అని లడ్డు కంగారు పడడం.. అందుకు తగ్గట్లే ముగ్గురు ఫ్రెండ్స్ నానా అల్లరి చేయడం.. ఇలా పెళ్లి ఇంట్లో సందడి సందడిగా సాగిపోతాయి సన్నివేశాలు. ముఖ్యంగా లడ్డు పెళ్లి ఆగిపోవడం.. తదనంతర పరిణామాలు కడుపుబ్బ నవ్విస్తాయి. చాలా సినిమాల్లో చూసిన కామెడీనే అయినా.. పెళ్లి ఆగిపోవడం గురించి అడగని వాళ్లకు కూడా చెప్పి ఫ్రెండును ఇబ్బంది పెట్టే నేపథ్యంలో కామెడీ హిలేరియస్ అనిపిస్తుంది. చివరికి గోవాలో ఫుడ్ డెలివరీ బాయ్ కి సైతం విషయం చెబితే అతను జాలిపడడం లాంటి సీన్లు ప్రేక్షకుల కడుపులు చెక్కలు చేస్తాయి. కథ పెళ్లి ఇంటి నుంచి గోవాకు మారిన కొంత సేపటి వరకు 'మ్యాడ్' సరదాగానే సాగిపోతుంది.

**'మ్యాడ్' మూవీతో యువ ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తింది చిత్ర బృందం. ఇప్పుడా చిత్రానికి సీక్వెల్ తయారైంది. కళ్యాణ్ శంకర్ దర్శకత్వంలో నార్నె నితిన్-సంగీత్ శోభన్-రామ్ నితిన్ ప్రధాన పాత్రలు పోషించిన 'మ్యాడ్ స్క్వేర్' ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మరి 'మ్యాడ్' లాగే ఇదీ ప్రేక్షకులను నవ్వించగలిగిందా? తెలుసుకుందాం పదండి.**




# జస్ట్ ఓకే ఫన్!

### కథనం-విశ్లేషణ:

తెలుగులో కామెడీ సినిమాలు చాలానే చూశాం కానీ.. 'మ్యాడ్' వాటిలో స్పెషల్. అందులో కథ అంటూ ఏమీ ఉండదు. స్క్రీన్ ప్లే స్ట్రక్చర్ అంటూ ఏమీ కనిపించదు. కాలేజీలో గ్యాంగ్స్ మధ్య జస్ట్ ఏదో ఒక సిచువేషన్ క్రియేట్ చేయడం.. క్యారెక్టర్లను నిలబెట్టి పంచు డైలాగులు వేయించడం.. సినిమా అంతా ఇదే వరస. కానీ ఆ పంచులే భలేగా పేలుతూ వినోదాన్ని పంచాయి. హీరో హీరోయిన్లు ఆకర్షణీయంగా కనిపించారు.. పాత్రలకు తగ్గట్లు పెర్ఫామ్ చేశారు.. కాలేజ్ సెటప్ బాగా కుదిరింది.. మంచి పాటలూ తోడై సినిమా యువతను బాగా ఆకట్టుకుంది. ఈ సినిమాకు సీక్వెల్ అంటే ఇంకా ఎక్కువ వినోదం ఆశించడం సహజం. ఈసారి కాలేజీలోనే కథను నడిపిస్తే మొనాటనస్ అవుతుందనేమో.. పెళ్లి–గోవా అంటూ సెటప్ మొత్తం మార్చారు. కానీ ఈ సెటప్‌లో అనుకున్నంతగా వినోదం పండలేదు. 'మ్యాడ్'లో సహజంగా తన్నుకొచ్చిన వినోదం.. ఇక్కడ మాత్రం ఫోర్స్ట్ ఫీల్ కలిగిస్తుంది. 'మ్యాడ్'లో మాదిరి సరైన సిచువేషన్లు క్రియేట్ చేసి సహజంగా వినోదాన్ని పండించడంలో దర్శకుడు కళ్యాణ్ శంకర్ ఫెయిలయ్యాడు. అలా అని ఇందులో నవ్వులే పండలేదని కాదు.. కొన్ని సీన్లు బాగానే పేలాయి. కానీ 'మ్యాడ్'లో మాదిరి నాన్‌స్టాప్ ఫన్ డోస్ మాత్రం ఇందులో లేదు.

కానీ ఈ కథకు క్రైమ్ కామెడీ టచ్ ఇచ్చాకే 'మ్యాడ్' గాడి తప్పుతుంది. అనేక బాలీవుడ్ సినిమాలను తలపిస్తూ సాగే ఎపిసోడ్లలో కామెడీ పండలేదు. 'జాతిరత్నాలు' సినిమాను కూడా గుర్తు చేసే ద్వితీయార్ధం ప్రేక్షకులను అనుకున్నంతగా ఎంగేజ్ చేయలేకపోయింది. ఒకదశ దాటాక దర్శకుడిదగ్గర పంచులు అయిపోయాయేమో అనిపిస్తుంది. క్యారెక్టర్లన్నీ బాగా అలవాటు అయిపోయి.. ఎవరు ఏం మాట్లాడతారో.. దేనికి ఎలా రియాక్టవుతారో ముందే అంచనా వచ్చేస్తుంది. అందువల్లే కామెడీ పంచులు పేలలేదు. ద్వితీయార్ధంలో కామెడీ పండించడానికి సరైన సిచువేషన్లు క్రియేట్ చేయలేకపోయారు. బ్రోతల్ హౌస్‌లో కన్ఫ్యూజింగ్ కామెడీ పూర్తిగా తేలిపోయింది. మాఫియా డాన్‌గా సునీల్ పాత్ర చుట్టూ కొన్ని సీన్లు మాత్రం నవ్విస్తాయి. సినిమా పూర్తిగా నాన్ సీరియస్ మోడ్‌లో సాగుతుండడంతో క్రైమ్ ఎలిమెంట్ మీద ఆసక్తి కలగదు. ముగింపు సన్నివేశాలు పర్వాలేదు. ప్రథమార్థంలో కామెడీ.. మంచి ఊపున్న పాటలు పడడం.. రెండు పాటల్లో ప్రియాంక జవాల్కర్–మోనికా రెబ్బాల అందచందాలు ప్లస్ పాయింట్స్. కానీ ఫస్ట్ పార్ట్‌లో మాదిరి రొమాంటిక్ ట్రాక్స్ లేకపోవడం మైనస్. మొత్తంగా చూస్తే.. 'మ్యాడ్ స్క్వేర్' ఓ మోస్తరు వినోదంతో ఓకే అనిపిస్తుంది. కానీ 'మ్యాడ్' మాదిరి ఇందులో ఆర్గానిక్ కామెడీని చూడలేం. దాన్ని మించిన వినోదం అంటూ టీం పెంచిన అంచనాలను సీక్వెల్ అందుకోలేకపోయింది.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...

# రెవెన్యూ ఉద్యోగి బరితెగింపు !?

**- టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో ప్రత్యక్షం**

**- ముక్కున వేలేసుకుంటున్న ఉద్యోగ వర్గాలు**

**(సత్యంన్యూస్, పొందూరు)**


ఆయనో రెవెన్యూ ఉద్యోగి.. అయితే నాకేంటి అనే భావం ఆయన నరనరాల్లో జీర్ణించుకుపోయింది. రెండు రోజుల క్రితం జరిగిన ఓ సంఘటనే ఇందుకు ఓ చక్కని ఉదాహరణ. మరెందుకు ఇక ఆలస్యం. ఆయనెవరో, ఆయన గారు చేసిన నిర్వాహకమేమిటో చదివేద్దాం. ఆముదాలవలస నియోజకవర్గం పొందూరు మండలం మజ్జిలపేట గ్రామానికి చెందిన ఆయన పేరు జి. జనకచక్రవర్తి. పేరులో చక్రవర్తి ఉండడం వల్లనేమో ఆయన ఓ రెవెన్యూ ఉద్యోగిననే విషయాన్ని మరిచి అధికార పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఇటీవల కాలం వరకు వీఆర్వోగా పనిచేసిన ఆయన సీనియర్ అసిస్టెంట్ గా పదోన్నతి పొందారు. ప్రస్తుతం ఈయన పొందూరు తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగం వెలగబెడుతున్నారు. స్వగ్రామమైన మజ్జిలపేటలో రెండు రోజుల క్రితం నిర్వహించిన టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొనడమే కాకుండా ఫోటోలకు ఫోజులిచ్చారు. ఈ ఫోటోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. వాస్తవానికి ప్రభుత్వ ఉద్యోగులు ఎవరూ రాజకీయ పార్టీలతో సంబంధం గాని, ఆయా కార్యక్రమాల్లో పాల్గొనడం కాని చేయకూడదు. ఈ విషయం సదరు జనకచక్రవర్తికి తెలియక చేసిన తప్పుకాదు. అన్నీ తెలిసిన ఈయన నా సొంత మండలంలో, నా స్వగ్రామంలో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటే నాకొచ్చిన ఇబ్బందేమిటి, ఎవరేమి చేస్తారు అనుకున్నారేమో. అందుకే ఎలాంటి బెంగ, భయం లేకుండా టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈయన చేసిన నిర్వాకానికి అధికారుల స్పందన ఏ విధంగా ఉంటుందో వేచి చూడాల్సిందే.





వైకాపా పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ ఇటీవల మరణించారు. ఈ క్రమంలో సోమవారం ఒంగోలు సోమవప్పాడులో ఆ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, శాసనమండలి సభ్యులు పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, యువ నాయకులు రెడ్డి శ్రావణ్‌లు వైవీ సుబ్బారెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా పిచ్చమ్మ మృతికి సంతాపం తెలిపారు. కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం



అరసవల్లి సూర్యనారాయణ స్వామి శాశ్వత అన్నదాన పథకానికి గర్లంకి ఉమామహేశ్వరరావు, ఈశ్వరమ్మ లక్ష రూపాయలు విరాళాన్ని ఆలయ కార్యనిర్వాహణాధికారి వై.భద్రాజీకి అందజేశారు. అనంతరం వారికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి జ్ఞాపికను అందజేశారు. కాగా స్వామివారికి టికెట్ల రూపంలో రూ.70,600, పూజలు, విరాళాల రూపంలో రూ. 56,462, ప్రసాదాల రూపంలో రూ.1,04,030 స్వామి వారికి ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం

# కవి సమ్మేళనంలో అనంతరామన్

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది కవి సమ్మేళనంలో బూరవెల్లికి చెందిన రచయిత ఆరవెల్లి అనంతరామన్ పాల్గొని సత్కారం అందుకున్నారు. ఆయనతో పాటు పాల్గొన్న కవులకు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్‌తోపాటు జాయింట్ కలెక్టర్, ఆర్డీవో తదితరులు పాల్గొని కవులను దుశ్శాలువలు, జ్ఞాపికలతో సత్కరించారు.

# తెలుగు సంస్కృతి, జానపద కళలను పరిరక్షించాలి



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

తెలుగు సంస్కృతి, జానపద కళారూపాలను పరిరక్షించుకోవాల్సిన గురుతర బాధ్యత సమాజంపై ఉందని ఎమ్మెల్యే శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. అరసవల్లిలోని మణిపాత్రుని క్రియేటివ్ అకాడమీ క్యాంపస్‌లో నిర్వహించిన ఉదయభాస్కర్ ఉగాది రాష్ట్ర పురస్కార ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. జానపద కళలు సంగీతము చిత్రలేఖనం, వాయిద్యాలలో శిక్షణ అందిస్తున్న ఎంసీఏ అకాడమీ సేవలు అద్భుతమన్నారు. ఉగాది సందర్భంగా వివిధ కళల్లో కృషి చేస్తున్న రచయితలకు, అవార్డులు ఇవ్వడం స్వాగత పరిణామమన్నారు. ఆత్మీయ అతిథిగా పాల్గొన్న విశ్రాంత డి.ఇ.వో బలివాడ మల్లేశ్వరరావు ఎం.సి.ఎ అకాడమీ సేవలను ప్రశంసించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే గొండుశంకర్ వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారికి సన్మానించారు.గ్రామ నామాల పరిశోధనా విభాగంలో వాండ్రంగి కొండలరావు, జానపద సాహిత్యంలో భగవాను దాసును, జానపద కళాశాహిత్యంలో బద్రి కూర్మా రావును, నాటక రంగంలో ఎరపాటి అప్పారావు, గానంలో నేరెళ్ల సత్యనారాయణ, హరికథా విభాగంలో వడగ బాలసుబ్రమణ్యం, డోలక్ వాద్యంలో లక్ష్మణరావు, వైద్యంలో ఇంజరాపు మోహన్‌రావు, యువసేవలో వేపారి శ్రీనివాస్, నాట్యంలో కంటూ మురళి గోవింద్ సేవరత్న పురస్కారమిచ్చి, ఘనంగా సన్మానించి గౌరవించారు. బాలరంజని విభాగంలో ఉత్తమ బాలలకు బాలరత్న బిరుదునిచ్చి సత్కరించారు. కార్యక్రమంలో ఎల్లినాటి ధరణి, ఎం లిపి శ్రీవల్లి, ఎం జయదేవ కుమార్, బి సన్నిహిత్, శ్రీకాకుళం చిట్టి, బిన్నాడ దీక్షితులు, వెంకట్రావ్ మాస్టర్, యోగానంద్, బాల రంజని రాష్ట్ర కార్యదర్శి డబ్బీరు గోవిందరావు, ఎంసీఏ అధినేత్రి ఎం భాగ్యలక్ష్మి శ్రావణి, కార్యదర్శి ఎం టి వి ఆర్ మూర్తి, ఫౌండర్ ప్రెసిడెంట్ మణిపాత్రుని నాగేశ్వరరావులు పాల్గొన్నారు.




# యువ రచయితల సంఘానికి విరాళం

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

యువ రచయితలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్న యువ రచయితల సంఘానికి నైరలోని వ్యవసాయ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్, దాత డాక్టర్ ఆరికతోట కనకరాజు రూ.ఐదు వేల విరాళం అందజేశారు. సంఘం వ్యవస్థాపకురాలు యర్రమ్మకు ఉగాది ఉత్సవాల సందర్భంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎనిమిది మంది యువ రచయితలు వాసవి, వేదవతి, గనస్వామి, జగదీశ్వరరావు, చిన్నారావు, శ్యామల, ఎర్రమ్మ, సవరమ్మ ఉగాది కవితలు వినిపించారు. ఈ కార్యక్రమంలో సురంగి మోహనరావు, బలివాడ మల్లేశ్వరరావు, విష్ణు మూర్తి, రఫీ, తదితరులు పాల్గొన్నారు.



# డిఎస్సీ-2003 ఫోరం సభ్యుల సమావేశం

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**


2003 డీఎస్సీ ఫోరం సభ్యులు సమావేశం ఫోరం కన్వీనర్ కె.శ్రీహరి అధ్యక్షతన స్థానిక ఎన్జీవో హోంలో నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీహరి మాట్లాడుతూ 2003 డీఎస్సీ అనేది కేవలం ప్రభుత్వ నిర్లక్ష్యం వలనే నియామకాలు లేటయ్యాయన్నారు. 2005 నవంబర్‌లో నియామకాలు చేపట్టారన్నారు. దానివల్ల 2003డిఎస్సీకి సంబంధించిన వ్యక్తులందరూ పాత పెన్షన్ విధానాన్ని కోల్పోవాల్సి వచ్చిందన్నారు. కావున కేంద్ర ప్రభుత్వం ఇచ్చినటువంటి మెమో 57 ప్రాప్తికి ఈ డీఎస్సీకి చెందిన వ్యక్తులందరికీ, అర్హత గల వారందరికీ పాత పెన్షన్ విధానం వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై కోర్టు కూడా వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. దీనిలో భాగంగా వర్క్‌షాప్ నిర్వహించామన్నారు. సమావేశంలో ఈస్ట్ గోదావరికి చెందిన రూపరాజు మాట్లాడుతూ తమది న్యాయపరమైన సమస్య అన్నారు. కాబట్టి కోర్టులో కేసు వేయడం వలన లబ్ది చేకూరే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో జిల్లా కో-కన్వీనర్లు కె.ప్రకాష్, పి శ్రీకర్, బి.శ్రీను, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.




# రామకౌండిన్యకు రాష్ట్ర ఉగాది పురస్కారం-2025

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఉగాది పురస్కారోత్సవాలలో భాగంగా నగరానికి చెందిన శ్రీభాష్యం సుందర రామకౌండిన్య ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉగాది పురస్కారం-2025ను అందుకొన్నారు. రామకౌండిన్య గురువు శ్రీకాంత్ వద్ద నృత్యం నేర్పుకోవడం అందరికి విదితమే. శ్రీకాకుళం జిల్లా నాట్యరంగ చరిత్రలో ఇప్పటి వరకు ఇద్దరు మాత్రమే ఈ ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. 2017లో అతని గురువు శ్రీకాంత్ ఈ పురస్కారాన్ని అందుకోగా ఇప్పుడు శ్రీకాంత్ శిష్యుడు రామకౌండిన్య ఈ పురస్కారాన్ని ఈ 2025 సంవత్సరంలో అందుకొని శ్రీకాకుళం ఖ్యాతిని కూచిపూడి నాట్యం ద్వారా మరోసారి చాటిచెప్పారు. రామకౌండిన్య ఈ ఉగాది పురస్కారంను అందుకున్నందుకు పలు కళా సంస్థలు, కళాకారులు, అభిమానులు ప్రశంసించారు.



'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

# విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం

**-గొల్లగండి, చేపల గొల్లగండి ప్రజల ఆనందం**

**-ఎమ్మెల్యే, ఇతర నాయకులకు కృతజ్ఞతలు**



**(సత్యంన్యూస్, ఇచ్ఛాపురం)**

ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని గొల్లగండి, చేపల గొల్లగండి గ్రామాలను సుదీర్ఘ కాలంగా వేధిస్తున్న విద్యుత్ సమస్యను స్థానిక ఎమ్మెల్యే, టీడీపీ, జనసేన నాయకుల చొరవతో అధికారులు పరిష్కరించారు. ఈ గ్రామాల్లో ఏళ్ల తరబడి ఉన్న ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ గొల్లగండి మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు, జనసేన నేత గుండుపల్లి చిన్నరాజారావు స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త దాసరి రాజులకు వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన వారు సమస్య తీవ్రతను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ మేరకు సోంపేట ఏఈ రవికుమార్ ఆయా గ్రామాల్లో పర్యటించి 19 కొత్త విద్యుత్ స్తంభాలు, ఐదున్నర కి.మీ. నిడివిగల విద్యుత్ వైరు, ఇతర పరికరాలు ఉన్నతాధికారుల ద్వారా మంజూరు చేయించి యుద్ధప్రాతిపదికన పనులు చేయించారు. విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్, జనసేన సమన్వయకర్త దాసరి రాజులతోపాటు ట్రాన్స్‌కో ఎస్ఈ, పలాస డీఈ, సోంపేట ఏడీ, ఇతర విద్యుత్ సిబ్బందికి పంచాయితీ సర్పంచ్ నాగం భాస్కరరావు, గ్రామ పెద్దలు గండుపిల్లి దండాసి, గండుపల్లి గంగయ్య, గోవింద ధర్మరాజు, గండుపల్లి మీనారావు, తెప్పల యాదవరావు, తెప్పల సుందరావు, రత్నాల బాబురావు, తెప్పల హరిబాబు, గండుపల్లి భాస్కరరావు, సాగురు హేమరాజు, పుక్కళ్ల మదన్, సాగూరు హరి, సాగూరు రాజు, అశోక్, గణేష్, నారాయణ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.





# ఈ ఏడాది శుభ ఫలితాలే

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

కొత్త ఏడాదిలో 75శాతం శుభఫలితాలే అందనున్నాయని ప్రముఖ పంచాంగకర్త అళగిరి కిషోర్ జోస్యం చెప్పారు. విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా పీఎన్ కాలనీలోని పంచాయతన దేవాలయంలో ఆదివారం ఆయన పంచాంగ శ్రవణం చేశారు. మొదట అళగిరి కిషోర్‌తోపాటు ఆలయ ధర్మకర్తలు పి.జగన్మోహనరావు, కనుగుల దుర్గాప్రసాద్, డాక్టర్ నిక్కు అప్పన్న, లలితా పీఠం అధిపతి వజ్జలలు కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కొత్త పంచాంగాన్ని ఆవిష్కరించి, పంచాంగకర్త కిషోర్‌ను సత్కరించారు. అనంతరం అళగిరి కిషోర్ పంచాంగం శ్రవణం చేశారు. ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురుస్తాయన్నారు. గ్రహాల ప్రభావంతో ప్రజలు 75 శాతం శుభ ఫలితాలు అందుకుంటారన్నారు. షష్టగ్రహ కూటమి విషయంలో భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. వ్యక్తిగతంగా చూస్తే కర్కాటక, వృశ్చిక, కుంభ రాశులవారికి కాస్త తక్కువ శుభ ఫలితాలు లభించినా మిగతా రాశులవారికి ఈ ఏడాది బాగుంటుందన్నారు. అంతరిక్ష, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, పరిశోధన రంగాల్లో భారతదేశం తనదైన ముద్ర వేస్తుందన్నారు. రాశి ఫలాలు, దోషాలు -వాటికి పరిహారాలు, దర్శించాల్సిన ఆలయాలు, చేయాల్సిన పూజల గురించి వివరించారు. ఆలయ ధర్మకర్త జగన్మోహనరావు మాట్లాడుతూ ఇక నుంచి ప్రతి ఏటా ఆలయంలో పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అలాగే ఆలయ ప్రాంగణంలో అళగిరి కిషోర్ ఆధ్వర్యంలో ఉచిత జ్యోతిష్య శాస్త్ర బోధన ఉంటుందని చెప్పారు. వారంలో ఒకరోజు రెండు గంటలపాటు నిర్వహించే ఈ తరగతులకు ఆసక్తి ఉన్న అన్ని వర్గాల ప్రజలు హాజరుకావచ్చన్నారు.




డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001




# డైట్‌నూ డీఈవో సీటునూ వదలరు



(మొదటిపేజీ తరువాయి)

వీటిని క్లియర్ చేయాలని గట్టిగా చెప్పారు తప్ప డీఈవోను తప్పించండంటూ నొక్కి వక్కాణించలేకపోయారు. ప్రస్తుతం పదిమందిపై సస్పెన్షన్లను ఎత్తివేశారు. ఇక మిగిలిన నలుగురిపై క్రిమినల్ కేసులు, సస్పెన్షన్లు ఉన్నాయి. అచ్చెన్నాయుడు ఫోన్‌లో ఇచ్చిన ఆదేశాల మేరకు మిగిలిన నలుగురిపై కూడా క్రిమినల్ చర్యలు, సస్పెన్షన్లు రద్దు చేస్తారు తప్ప డీఈవో మీద చర్యలుండేవనే ప్రాథమికంగా అర్థమవుతుంది. చూసి రాయించడం కోసం ఒక్కో విద్యార్థి నుంచి రూ.30వేలు మొదలు రూ.50వేలు వరకు ఇన్విజిలేటర్లు వసూలు చేశారని డీఈవో ఆరోపించిన నేపథ్యంలో దాని మీద విచారణ జరపాల్సిన అవసరం ఉంది. అది జరగాలంటే ముందు డీఈవోను తప్పించాలి. కానీ జులైలో పదవీ విరమణ చేయనున్న తిరుమల చైతన్య జోలికి ఇప్పుడు ప్రభుత్వం పోతున్నట్టు కనిపించడంలేదు. ఉపాధ్యాయ సంఘాలు సస్పెన్షన్లు, డిబార్లు, క్రిమినల్ కేసుల అంశంలో విద్యాశాఖ వెనక్కు తగ్గడంతో ఉద్యమ కార్యాచరణను విరమిస్తారో, లేదూ అంటే డీఈవోను తప్పించేవరకు కొనసాగిస్తారో తేలాల్సి ఉంది.

శ్రీకాకుళం జిల్లా ప్రజలకు శుభవార్త
ప్రముఖ ప్రసూతి మరియు స్త్రీవైద్య నిపుణులు
తేది: 5-4-2025 శనివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచితంగా చూడబడును.
డా॥ బొడ్డేపల్లి మీనాక్షి M.B.B.S., DGO
ప్రసూతి మరియు స్త్రీ వైద్యనిపుణులు
హిమోగ్లోబిన్, షుగర్ టెస్టులు ఉచితంగా చేయబడును.
అవసరమైనచో థైరాయిడ్ టెస్ట్ 50% రాయితీతో చేయబడును.
ఉచితంగా ఓపీ చూడబడును. ఈ అవకాశం ఈ ఒక్కరోజు మాత్రమే.
తేది: 5-4-2025 శనివారం
ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు
-: ముందుగా అపాయింట్‌మెంట్ తీసుకోవలెను :-
శ్రీ వైష్ణవి గణేష్ డాక్టర్స్ ప్లాజా
డే & నైట్ జంక్షన్, పెట్రోల్ బంకు ఎదురుగా,
సత్య లాడ్జి ప్రక్కన, శ్రీకాకుళం, సెల్: 99854 69073, 98661 68604, 70755 18604

# డీఈఓను విధుల నుంచి తప్పించండి

☆ ఉపాధ్యాయులకు, విద్యార్థులకు న్యాయం చెయ్యండి
☆ మంత్రి అచ్చెన్నకు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక వినతి



(సత్యంన్యూస్, టెక్కలి)

పదో తరగతి పరీక్షల నిర్వహణలో భాగంగా అత్యుత్సాహంతో నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి ఉపాధ్యాయులను, విద్యార్థులను, భయభ్రాంతులకు గురి చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్యను విధుల నుంచి తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు కోరారు. సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక ప్రతినిధులు మాట్లాడుతూ కుప్పిలి ఆదర్శ పాఠశాలలో రెండు కేంద్రాల తనిఖీల సందర్భంగా డీఈవో స్క్వాడ్లు ఏర్పాటు నుంచి ఉపాధ్యాయుల సస్పెన్షన్స్, విద్యార్థుల డిబారు, క్రిమినల్ కేసుల వరకు ఎక్కడా నిబంధనలు పాటించలేదని వివరించారు. తన వ్యక్తిగత ఇమేజ్ కోసం తుంగలో తొక్కారని వివరించారు. డీఈవో అత్యుత్సాహంతో నిబంధనలకు విరుద్ధంగా ముగ్గురు ప్రధానోపాధ్యాయులతో పాటు 12 మంది ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారని, అందులో ఒక ప్రధానోపాధ్యాయుడితో పాటు నలుగురు ఉపాధ్యాయులపై 10వ తరగతి పరీక్షల నిర్వహణలో కనీవినీ ఎరుగని రీతిలో క్రిమినల్ కేసులు పెట్టారని తెలిపారు. విద్యార్థులను భయాందోళనకు గురిచేసి నిబంధనలకు విరుద్ధంగా ఐదుగురిని డిబార్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇదే సందర్భంలో మీడియాతో మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీలో సీట్ల కోసం ఉపాధ్యాయులు వేలకు వేలు రూపాయలు వసూళ్లకు పాల్పడ్డారని సత్యదూరమైన వ్యాఖ్యలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో నిజానిజాలు వెలికి తీసేందుకు వీలుగా డీఈఓను విధుల నుంచి తప్పించి జిల్లా కలెక్టర్ నాయకత్వంలో దర్యాప్తు కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ఉపాధ్యాయులపై పెట్టిన క్రిమినల్ కేసులను వెంటనే ఉపసంహరించుకునేలా, డిబారైన ఐదుగురు విద్యార్థులకు వెంటనే న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి

# పేదలకు వరం

✦ రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
✦ 14 మంది సహాయనిధి చెక్కులు అందజేత



(సత్యంన్యూస్, టెక్కలి)

ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్)తో రాష్ట్రంలోని ఎందరో పేదల ప్రాణాలు కాపాడుతున్నామని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం టెక్కలి నియోజకవర్గానికి చెందిన 14 మందికి లబ్ధిదారులకు రూ. 14,73,550 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో వైద్యం, విద్యకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రికి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఆధ్యాత్మిక కేంద్రంగా సంతబొమ్మాళి మండల కేంద్రం

ఆధ్యాత్మిక కేంద్రంగా సంతబొమ్మాళి మండల కేంద్రాన్ని తీర్చిద్దే బాధ్యత తనదని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సంతబొమ్మాళి మండలం కేంద్రంలో సూర్యనారాయణ స్వామి ఆలయ శంకుస్థాపన మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ ఆధ్యాత్మిక కేంద్రంగా సంతబొమ్మాళి మండలం కేంద్రాన్ని తీర్చిదిద్దే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొనడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు.




## రంజాన్ ప్రార్థనల్లో ఎమ్మెల్యే శంకర్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం పట్టణంలోని జామియా మసీదు, శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురంలోని ప్రముఖ మసీదుల్లో ముస్లిం సోదరులు రంజాన్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో ప్రార్థన చేశారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల రోజుల పాటు ఎంతో కఠోర దీక్షతో ఉపవాసాలు చేసి రంజాన్ వేడుకలను జరుపుకోవడం విశేషమని, ఇటువంటి కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. శాంతి సౌభ్రాతృత్వం, ఐకమత్యం ఒకరికొకరు అనురాగాలు పంచుకోవడం, స్నేహభావం ఎంతో గొప్పదన్నారు. ముస్లిం సోదరులంటే ఎంతో గౌరవమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు పెద్ద సంఖ్యలో సంఖ్యలో పాల్గొన్నారు.



నారా భువనేశ్వరిని ఏపీ శిష్టకరణ ప్రధాన కార్యదర్శి ఎంసిహెచ్ఎస్ గౌరీశంకర్, కోశాధికారి బెహరా రాధాకుమారి, సహాయ కార్యదర్శి సీఎం కవిత కలిసి దుస్సాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా భువనేశ్వరి శిష్టకరణ సామాజికవర్గ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

– సత్యంన్యూస్, అమరావతి

## చేయని నేరాలకు అక్రమంగా

# కేసులు బనాయిస్తున్నారు

❖ గిరిజన సంక్షేమ సంఘ నాయకులు
❖ ఎక్సైజ్ శాఖపై ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు



(సత్యంన్యూస్, మందస)

మందస మండలం గిరిజన గ్రామాల్లో నాటు సారా తయారీకి, అమ్మకాలకు సంబంధంలేని గిరిజన యువకులు, గిరిజన మహిళలు, బాలింతలపై ఎక్సైజ్ పోలీసులు అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని శ్రీకాకుళం జిల్లా గిరిజన సంక్షేమ పరిరక్షణ సంఘం నాయకులు, సంఘం ప్రతినిధులు సవర నరసింహారావు, సవర నారాయణ రావు, సవర హరికృష్ణ, సవర బాలకృష్ణ, ఎస్.హరి, సవర సోమయ్య, ఎస్.లక్ష్మణరావు, ఎస్.శంకర్, ఎస్.మాధవ, ఎస్.జైరాజ్, ఎస్.తులసీ రావ్, రైతుకూలీ సంఘం ప్రతినిధి కె.రమేష్ తెలిపారు. ఈమేరకు వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ కొండలోగాం, టబ్బగం, చాపరాయి, రామరాయి, పట్టులోగాం, దళాకాయి తదితర గిరిజన గ్రామాల్లో ఒక్కొక్క గిరిజన గ్రామంలో 15 నుంచి 20 మంది వరకు గిరిజనులపై అన్యాయంగా సారాకేసులు పెడుతున్నారని తెలిపారు. చదువుకున్న గిరిజన యువకులు, రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో కూలి పనులు చేస్తున్న గిరిజన యువకులపై, ఇతర రాష్ట్రాల్లో ఉపాధి కోసం వెళ్లి అక్కడ జీవనోపాధి సాగిస్తున్న గిరిజనులపై కూడా అక్రమ కేసులు బనాయిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్సైజ్ శాఖ పోలీసులు అక్రమ కేసులు బనాయించడం వల్ల ఆర్థికంగా నష్టపోతున్నామని, చేయని నేరానికి కష్టాలు అనుభవించి అధిక వడ్డీలకు అప్పులు చేసి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. అక్రమ కేసులు పెట్టడం వల్ల బెయిల్ కోసం ప్రైవేటు న్యాయవాదులకు ఆశ్రయించి డబ్బులు వెచ్చించాల్సి వస్తుందని, వారాలు తరబడి బెయిల్ రాక జైలులో గిరిజనులు ఉంటున్నారని, కోర్టు వాయిదాల కోసం తరచూ వెళ్లాలంటే ప్రయాణ ఖర్చులు ఎక్కువవుతున్నాయని వారు వాపోయారు. తక్షణమే జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో స్పందించి గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. అక్రమ కేసులు బనాయింపుపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు ఈ విషయంపై మానవ హక్కుల కమిషన్‌కు, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్టు వారు తెలిపారు

# 250 మందికి రంజాన్ తోఫా పంపిణీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రంజాన్ మాసం పురస్కరించుకొని విశాఖ-ఏ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ముస్లింలకు రంజాన్ తోఫా కిట్లు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో కలిసి ఎమ్మెల్యే గొండు శంకర్ చేతుల మీదుగా 250 మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి, ప్రజా సంక్షేమానికి తెలుగుదేశం ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్రాంతి కానుకలు, రంజాన్ తోఫా వంటి కార్యక్రమాలు వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత కనుమరుగైపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, టీడీపీ నగర మైనారిటీ విభాగం అధ్యక్షుడు షేక్ నిజాముద్దీన్, బహదూర్ బాషా, ఎం.డి.రఫీ, షేక్ సలీం, షేక్ హుస్సేన్, ఎండి జాంగిర్,



షేక్ రిహాన్, షేక్ కమల్, టిడిపి మైనారిటీ మహిళా విభాగం నాయకులు ఆయేషా, షకీరా, జాస్మిన్, షేక్ పర్వీన్, నన్ని, షేక్ రేష్మ తదితరులు పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.